క్లుప్తంగా

సొసైటీ మహాజన సభ నేడు

సింహాచలం : అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌కి వెళ్లే మార్గంలో ఉన్న బృందావనం మండపంలో ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సొసైటీ లావాదేవీలు, డివిడెండ్ల పంపిణీ, తదితర విషయాలపై సభ్యులతో చర్చిస్తామని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులంతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు



పెందుర్తి : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 20వ రోజు శనివారం వెంకటాద్రిపై వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమొరై, తిరుప్పావై, పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి నిర్వహించారు. వివిధ రకాల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. తిరుప్పావై 20వ పాశురాన్ని వివరించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నామని అర్చకులు తెలిపారు.

కార్మికుల సమస్యలపై నేడు సభ



కరపత్రం విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ : రవాణా రంగ కార్మికుల సమస్యలపై ఈ నెల 5న అనకాపల్లిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కార్మికులంతా అధిక సంఖ్యలో తరలి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని వాడచీపురుపల్లిలో శనివారం విడుదల చేశారు. ఈ సభలో అఖిలభారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని గనిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన ఇద్దరు అరెస్ట్

పెందుర్తి : ఓ దుకాణంలో ఇనుము దొంగలించడానికి ప్రయత్నించిన ఇద్దరిని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యం మత్తులో ఈ చోరీకి పాల్పడినట్టు తెలియడంతో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. వేపగుంట – పినగాడి రోడ్డు లక్ష్మీపురం సమీపంలో ఓ మెకానిక్ దుకాణం ఉంది. దీనికి సమీపంలో లక్ష్మీపురానికి చెందిన గొంప ప్రియదర్శన్, కంచరపాలేనికి చెందిన కామిరెడ్డి ప్రసాద్ శుక్రవారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. తర్వాత ఆ దుకాణంలోకి చొరబడ్డారు. గమనించిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీంతో స్పందించిన పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ చేయగా వారిద్దరూ మద్యం మత్తులో చోరీకి యత్నించినట్లు తేలింది. దీంతోపాటు వీరిపై గతంలో కూడా ఎలాంటి నేరాభియోగాలు లేకపోవడంతో పూర్తి స్థాయి వివరాలు సేకరించి స్టేషన్ బెయిల్‌పై పంపినట్లు ఎస్ఐ సూరిబాబు తెలిపారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: ఈ నెల 8న విశాఖలో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సబ్బవరం మండలం నుండి 7,500 మంది జనాభాను తరలించేందుకు 150 వరకూ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎంఈడీవో పద్మజ, ఏవో శివరామప్రసాద్, ఈవో పీఆర్డీ చైతన్య, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీస్కూల్ డే

పరవాడ : మండలంలో వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్బవరం సీడీపీవో లలిత కుమారి మాట్లాడుతూ పిల్లల అభ్యున్నతి, ఆట పాటల ద్వారా విద్యను అందించడం, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం ద్వారా పిల్లల్లో మేధోశక్తిని పెంచడం వంటి అంశాలను వివరించారు. అంగన్‌వాడీ సెంటర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దీపాంజలినగర్ బస్‌షెల్టర్..

బస్సులు నిలిపే ప్రదేశానికి దూరంగా నిర్మించడం వల్ల దీపాంజలినగర్ బస్ షెల్టర్ నిరుపయోగంగా పడి ఉంది. ఈ షెల్టర్ నిర్మించినప్పటికీ బస్సులు నిలిపే పాయింట్‌కు దూరంగా ఉండడం వల్ల దీనిని ప్రజలు వినియోగించడం లేదు.



ఊటగెడ్డ బస్ షెల్టర్..

ఊటగెడ్డ కూడలిలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ఇపుడిపుడే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్న తరుణంలో వాహన చోదకులు తమ వాహనాలను భద్రపరచుకోవడానికి దీనిని ఉపయోగిస్తున్నారు. దీంతో ఈ బస్ షెల్టర్‌లో ప్రయాణికులు వేచి ఉండేందుకు కూడా అవకాశం లేక వారు దీన్ని వినియోగించుకోలేకపోతున్నారు.



గొరుసువానిపాలెం బస్ షెల్టర్..

గొరుసువానిపాలెం కూడలిలో నిర్మించిన బస్ షెల్టర్ ప్రయాణికులకు అనుకూలంగా ఉన్నప్పటికీ స్థానికులు దీన్ని అపరిశుభ్రంగా మార్చడం వల్ల ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. ఈ షెల్టర్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. షెల్టర్‌ను పరిశుభ్రంగా ఉంచడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

రూ. లక్షల వ్యయం.. లక్ష్యం శూన్యం

సింహాద్రి ఎన్టీపీసీ, మైలాన్ పరిశ్రమలు ప్రజల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో దీపాంజలినగర్, గొరుసువానిపాలెం, ఊటగెడ్డ కూడలి, ఎన్టీపీసీ, పరవాడ మండల కాంప్లెక్స్ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు ప్రజల ఆదరణకు నోచుకోక కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా పడి ఉన్నాయి. 20 ఏళ్ల క్రితం ఒక్కొక్క బస్ షెల్టర్ నిర్మాణానికి సుమారు రూ.5 లక్షలు ఎన్టీపీసీ యాజమాన్యం ఖర్చు చేసింది.

ప్రజలకు అక్కరకు రాని బస్ షెల్టర్లు

- దీపాంజలినగర్, గొరుసువానిపాలెం, ఊటగెడ్డ కూడలి, ఎన్టీపీసీ, పరవాడ మండల కాంప్లెక్స్ బస్టాపులను వినియోగించని ప్రయాణికులు
- బస్సులు ఆగని చోట నిర్మాణమే కారణం



సింహాద్రి పరిపాలన భవనం సమీపంలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్



మండల కాంప్లెక్స్ వద్ద శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్

పరవాడ: బస్సులు నిలిపే ప్రదేశాల్లో కాకుండా కాస్త దూరంగా బస్ షెల్టర్లను ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు వాటిని ఉపయోగించుకోలేకపోతున్నారు. దీపాంజలినగర్, ఎన్టీపీసీ మెయిన్ గేటు, ఊటగెడ్డ కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఆమడ దూరంలో నిర్మించడంతో అవి నిరుపయోగంగానే ఉన్నాయి. సదాశయంతో నిర్మించిన బస్ షెల్టర్లు ఎవరూ వినియోగించుకోకపోవడం వల్ల అవి మరమ్మతులకు సైతం గురవుతున్నాయి. వాటికి ఎన్టీపీసీ యాజమాన్యం లక్షలాది రూపాయలు వెచ్చించి రెండు పర్యాయాలు రిపేర్లు కూడా చేయించింది.

ఎన్టీపీసీ బస్‌షెల్టర్..

ఎన్టీపీసీ పరిపాలన భవనం సమీపంలో ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ గత పదేళ్లుగా నిరుపయోగంగా పడి వుంది. ఈ బస్ షెల్టర్ కూడా ప్రయాణికులకు ఏమాత్రం అందుబాటులో లేదు. ఇటు పరిపాలన భవనానికి, అటు మెయిన్ గేటుకు మధ్యలో దీన్ని నిర్మించడం వల్ల ప్రయాణికులకు అందుబాటులో లేకుండా పోయింది. దుమ్ము, ధూళితో అధ్వాన్నంగా తయారయింది.

మైలాన్ బస్ షెల్టర్..

మైలాన్ పరిశ్రమ యాజమాన్యం సుమారు రూ.10 లక్షల వ్యయంతో పరవాడ మండల కాంప్లెక్స్ వద్ద పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ కూడా ప్రయాణికులకు అందుబాటులో లేకుండా పోయింది. మైలాన్ యాజమాన్యం ఉన్నత లక్ష్యంతో నిర్మించిన ఈ బస్ షెల్టర్ అధికారుల నిర్లక్ష్యానికి గురి కావడంతో శిథిలావస్థకు చేరింది. బస్ షెల్టర్ చుట్టూ దట్టంగా తుప్పలు, డొంకలు పెరిగి దుమ్ము, ధూళితో అధ్వానంగా తయారైంది. షెల్టర్ టాప్ రేకులు ఊడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇది యాచకులకు ఆవాసంగా మారింది.

బస్ షెల్టర్‌లో వాహనాల పార్కింగ్..



చాలా కాలం నిరుపయోగంగా ఉన్న ఊటగెడ్డ బస్ షెల్టర్ మరమ్మతుల అనంతరం విద్యార్థులు, ప్రయాణికులకు అనేక విధాలుగా ఉపయోగపడుతోంది. అయితే దీనిలో పలువురు వాహనాలను పార్క్ చేయడం వల్ల కూర్చోవడానికి వీలు కాక ఇబ్బందులు పడుతున్నాం. బస్ షెల్టర్‌లో వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి.

– రాజాన రాజు, రావాడ

వినియోగంలోకి తేవాలి..



మండల కాంప్లెక్స్ కూడలిలో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్ షెల్టర్‌కు రిపేర్లు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలి. ప్రయాణికులకు అందుబాటులో లేక ఇది శిథిలావస్థకు చేరుతోంది. అధ్వానంగా మారిన బస్ షెల్టర్‌కు రిపేర్లు చేయించి అందుబాటులోకి తీసుకొస్తే ప్రయాణికులు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– పెంద్యాల శ్రీనివాసరావు, వెన్నెలపాలెం

బస్సులు ఆగితే బాగుంటుంది..



దీపాంజలినగర్ బస్ షెల్టర్ వద్ద బస్సులు ఆగే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ షెల్టర్ వద్ద ప్రయాణికులు వేచి ఉన్నప్పటికీ డ్రైవర్లు కాస్త ముందుకెళ్లి బస్సులు ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు మారింది ఈ బస్ షెల్టర్ దుస్థితి.

– కదవల మాణిక్యం, దీపాంజలినగర్

స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ఎదగాలి



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు



పాల్గొన్న విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు

సబ్బవరం: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని, ఆయన స్ఫూర్తితో ఎదగాలని ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ ఎస్. శ్రీధర్ అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ హక్కులతో పాటు బాధ్యతలను నెరవేర్చినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో విశాఖవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో ఉత్సవాలను 12వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి ఉత్సవాలను దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. సూర్యప్రకాశరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పినట్లు యువత స్థిర నిర్ణయం, విశ్వాసంతో ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సెక్రటరీ స్వామి శ్వాసం వియానానంద మాట్లాడుతూ స్వామి వివేకానంద సందేశం చాలా సరళమైందని, సామాజికంగా సమతుల్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని స్వామి వివేకానంద అభిప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామి గీత స్వరానంద, అడ్వకేట్ రాంబాబు, ఎం. సత్యనారాయణరాజు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి



విద్యార్థులతో భోజనం చేస్తున్న శ్రీనివాసరావు, ఎంపీపీ నాగమణి, ఎంపీడీవో వెంకటరావు

పెందుర్తి : ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్తి స్థాయి అభివృద్ధికి కృషి చేస్తామని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ ఇప్పటి వరకు పదో తరగతి వరకు మాత్రమే భోజనం అందిస్తున్నామని... ఇక నుంచి రోజూ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో పోషకాహారం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కళాశాలలో ఏయే వసతులు కావాలో జాబితా ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమకూర్చుతామన్నారు. పిల్లలకు పెట్టే భోజనం విషయంలో నాణ్యత పాటించాలని... భోజనం బాగోకపోతే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీపీ మధుపాడ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవో సువర్ణ, ప్రిన్సిపాల్ లలితకుమారి, అధికారులు, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న హోంమంత్రి అనిత

సబ్బవరం: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విద్య మాత్రమే పెట్టుబడిగా గుర్తించాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఈ మండలంలో పుట్టి పెరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, ఇది భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, విశాఖ ఆర్‌ఐవో మురళీధర్, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పెందుర్తి బీజేపీ ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, ఇందల రమణ, బర్లికాన సాయినాథరావు, సబ్బవరం ఎంపీటీసీ సభ్యులు గొర్లి చైతన్య, బైలపూడి దేముడు, తహసీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా నియంత్రించాలి

గంజాయి రవాణా, విక్రయాలు చేసేవారిపై ఉక్కుపాదం మోపాలని హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించారు. మండలంలోని సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రౌడీషీటర్లపై ఆమె ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ పిన్నింటి రమణ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సహాయం



సంక్షేమ నిధి చెక్ అందిస్తున్న పింఛన్‌దారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెందుర్తి : రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం పెందుర్తి యూనిట్ ఇటీవల మృతి చెందిన ఆ సంఘం సభ్యుడు పీసీహెచ్ నారాయణమూర్తి కుటుంబానికి అండగా నిలిచింది. శనివారం పెందుర్తి యూనిట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణమూర్తి భార్య నారాయణమ్మకు జిల్లా సంక్షేమ నిధి నుంచి రూ.70 వేలు చెక్ అందించారు. కార్యక్రమంలో సంఘం పెందుర్తి యూనిట్ అధ్యక్షుడు అల్లం కృష్ణారావు, కార్యదర్శి వై.కామరాజు, అసోసియేటెడ్ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎస్‌డీసీ సీతారామారావు

పెందుర్తి : భూములకు సంబంధించిన ఏ సమస్య అయినా తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామారావు అన్నారు. మండలంలోని సరిపల్లిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణను సహించబోమన్నారు. మ్యుటేషన్, ఆన్‌లైన్ ప్రక్రియ పారదర్శకంగా చేయాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 9 వినతులు వచ్చాయి. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

పెందుర్తి : చినముషిడివాడకు చెందిన కోడి దుర్గ ప్రసన్నదేవి అనే పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైనట్లు బాలిక తల్లి కోడి కృష్ణవేణి పెందుర్తి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కృష్ణవేణి కుమార్తె దుర్గ ప్రసన్న పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం స్టడీ అవర్ ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అయితే అర్ధరాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీయగా ఫలితం లేదు. దీంతో తల్లి కృష్ణవేణి పోలీసులను ఆశ్రయించారు. తన కుమార్తె అదృశ్యం వెనుక సాయికుమార్ అనే యువకుడి హస్తం ఉన్నట్లు తెలిపారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ



ఎంఈవో రవీంద్రబాబుకు ప్రింటర్ అందజేస్తున్న లెక్కల పద్మ, తదితరులు



దివ్యాంగులకు స్టేషనరీ అందజేస్తున్న ఎంఈవో సాయి శైలజ

పరవాడ: లూయిస్ బ్రెయిలీ లిపితో ఎందరో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నిండాయని పెందుర్తి కూటమి ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ అన్నారు. బ్రెయిలీ జయంతి వేడుకలు మరిడిమాంబ కల్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వాలు అనేక రిజర్వేషన్లు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం పక్కా భవన నిర్మాణానికి నిధులు కేటాయించడానికి కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా అంధుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా అంధుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన 400 మంది దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, షేక్ ఇస్మాయిల్, వీరు యాదవ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సాయి శైలజ మాట్లాడుతూ సమగ్ర శిక్ష కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు వెలువల్లి ఫౌండేషన్ అందజేసిన స్టేషనరీ అందజేశారు. టి.భాస్కరరావు దంపతులు భోజన సదుపాయం కల్పించారు. ఎస్.అర్జునరావు, రవిరాజు, రవికుమార్, టి.కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎంజే రవీంద్రబాబు మాట్లాడుతూ బ్రెయిలీ జీవిత విశేషాలు వివరించారు. అదేవిధంగా సమగ్ర శిక్ష ద్వారా అందుతున్న సదుపాయాలన్నీ దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ లెక్కల పద్మ మాట్లాడుతూ అంధుల జీవితాల్లో బ్రెయిలీ లిపి వెలుగులు నింపిందన్నారు. ఈ సందర్భంగా ఆమె రూ.11 వేలు విలువ చేసే ప్రింటర్ అందజేశారు. అనంతరం దివ్యాంగ విద్యార్థిని ప్రశాంతి తండ్రి రాంబాబు భోజన సదుపాయం కల్పించారు. వీరిని మండల విద్యాశాఖ అధికారి అభినందించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు సింహాద్రి పాల్గొన్నారు.

గోదాదేవికి విశేషంగా పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా పాశురం విన్నవించారు. తదుపరి అమ్మ వారి ఉత్సవమూర్తిని పల్లకీలో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువన గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం విశేషంగా పూజలు నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై వేంజేపచేశారు. అనంతరం పాశురం విన్నవించి, విశేషంగా హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వేంకటేశ్వర స్వామిని, గోదాదేవిని దర్శించుకున్నారు. అర్చకుడు భార్గవ్ పూజలు నిర్వహించారు.